# రెక్కలొచ్చిన కోరిక

**-వీరాజీ**

''ఏది తప్పినా, ఏది తప్పకపోయినా - ఆదివారం నాడీ రేవు తప్పదు కదా!'' - కోడలు సరళ వాషింగ్ మెషీన్‌లో గుడ్డలు వేస్తూ- ''వొరేయ్ నాన్నా! డుంబూ..తాతయ్యగారి చొక్కాలేమైనా వుంటే యివ్వమన్రా మీ గ్రాండ్ మాని'' అంటూ కేకేసింది.

అత్తగారు సుమిత్ర వంటింట్లో-పీలర్‌తో బీరకాయ తొక్కుతీస్తూ-''రాజుగారూ పెయ్యిని కట్టించండీ'' అన్నట్లు-దానికి మళ్లీ నానమ్మ ఎందుకూ? వాళ్ల తాతయ్య బట్టలు వాడే తెస్తాడు. ''ఒరేయ్ బంగారు తండ్రీ-తాతయ్య గదిలోకెళ్లి..'' అంటుండగానే తరుణ్ అలియాస్ డుంబుగాడు ''యివిగో గ్రాండ్‌పా ప్యాంటూ షర్టూ, మఫ్లరూ-'' అంటూ అక్కడ అవి పడేసి పారిపోబోతూ- ''అరె'' అని వెనక్కితిరిగి తాతయ్య ప్యాంటు బ్యాక్ పాకెట్‌లో నుంచి రెండు రంగుకాయితం ముక్కలు తీశాడు.

సరళ కుతూహలం ఆపుకోలేక, ఆ ముక్కల్ని చటుక్కున అందుకుని-''భలే! మీ తాతయ్యగారు నిన్న ఆఫీసుకి డుమ్మాకొట్టి సినిమాకి చెక్కేసేర్రోయ్..'' అంది. అవి రెండూ డ్రస్ సర్కిల్ మ్యాటినీ టిక్కెట్ ముక్కలు ఆమె చేసిన శల్య పరీక్షలో-ఆ రెండూ శనివారం మధ్యాహ్నం టైటానిక్ సినిమా మ్యాట్నీ షోవి -అని కూడా కనిపెట్టేసింది. అలా థియేటర్ పేరునిబట్టి సినిమాపేరు చెప్పలేకపోతే-యీ కాలం వర్కింగ్ గాళ్ - సరళకెంతోయిన్‌సల్ట్ కదా!

సుమిత్రకి పీలర్ చేతిలో నిలబడలేదు. ఆమెకు చిరుచెమటలు పోశాయన్న సంగతి-నాలుగు మీటర్ల దూరం నుండి కనిపెట్టిన కోడలు-అత్తయ్య వేపు వేళాకోళంగా చూస్తూ- ''మీరు మామయ్యగారిని అదుపులో పెట్టడం లేదు సుమండీ!'' అంది.

సుమిత్ర కూరల తట్ట అట్లా వదిలేసి వచ్చి, కోడలి చేతిలోనించి-ఆమె వాషింగ్‌మిషన్‌లో వేస్తున్న గుడ్డలు లాగేసుకుని-వాటితోపాటే, టికెట్ ముక్కలు కూడా తీసేసుకుంది.

''నేను వేస్తాలే అమ్మా! నువ్వు ఆనక డ్రయ్యర్ లో వేద్దువుగాని..అబ్బాయి కేం కావాలో చూడు..'' అంటూ కోడల్ని అక్కడి నుంచి తోలేసింది.

ఆ రెండు టికెట్ ముక్కల్ని ఆమె గప్‌చిప్‌న తన జాకెట్‌లో దాచేసుకోడం-డుంబుగాడు చూడలేదు గాని-కోడలు పిల్లకి తలవెనుక కూడా కళ్లుంటాయ్. సరళ కనిపెట్టేసింది మరి!

బూట్‌లు పాలిష్ చేసుకుంటూ, డుంబుగాణ్ని ''కాకా'' పట్టి కార్టూన్ ఛానల్‌ని-మ్యూజిక్ ఏషియాకి మార్చుకుని-సినిమా తైతక్కలు చూస్తున్న రాజేష్-భార్య తెచ్చి యిచ్చిన కాఫీ చప్పరిస్తూ- ''నువ్వుగాని రుచి చూసి యిచ్చావా? యింత తియ్యగా వుంది!'' అన్నాడు.

''మీ డాడీ మార్నింగ్ వాక్ నుంచి యింకా రాలేదా?'' అంటూ, అతని సరసాన్ని యింత పిసరు పట్టించుకోకుండా-సరళ ఆ రెండు టిక్కెట్ ముక్కల మిస్టరీ గురించి తన థియరీ చెప్పింది. ''నిన్న మధ్యాహ్నం మీ అకవుంటెంట్ డాడీగారు స్టెనో వాసంతితో చెక్కేశారు సార్!'' అంది.

''ఛఫ్! రెండో టికెట్ ముక్క మీద 'వాసంతి' అని రాసుందా?'' అన్నాడు రాజేష్.

అవతల సుమిత్ర వాషింగ్ మెషీన్ మీద చేతులూ, యీ యిద్దరి మీదా, వారి గుసగుసల మీద కళ్లూ, చెవులూ వేసుంచడం - ఆ యిద్దరూ గమనించలేదు. ''చెబితే వినరు కదా! ఎప్పుడూ కోపమే'' అని భర్తమీద బేలపడింది సుమిత్ర.

రాజేష్ అన్నాడు- ''అసలే ఆ యిద్దరూ ఇరవై నాలుగ్గంటలూ వాదులాడుకుంటూనే వుంటారు. ఇక నువ్విప్పుడు ఆ యిద్దరి మధ్యా అగ్గిపుల్లగీసి పడేస్తున్నావన్న మాట!''

ఒక బూటు ఆమె వేపు తోసి-''యిది పాలిష్ చేస్తున్నట్లు నటించు. అమ్మయిటే చూస్తోంది. నేను నీకో 'షాక్' యిస్తాను. విను'' అన్నాడు.

నిజంగానే, భర్త చెప్పింది విని-సరళ 'షాక్' అయిపోయింది. తన డాడీ రంగధామయ్యగారు శనివారం మధ్యాహ్నం థియేటర్‌లో ఒకావిడ ప్రక్కన కూర్చొని సినిమా చూశాడు. చూశాడనడానికి వీల్లేదుట! వాళ్లు యిద్దరూ-చెంపలు రాసుకుంటూ, చెవులు కొరుక్కోవడమే ఎక్కువట! ఈ ఆరా తీసిన రాజేష్ ఫ్రెండ్ గిరీశం-ఆమెను దగ్గిరగా చూడలేదుట! బాగోదు కదా!

తీరా సినిమా అయ్యేసరికి యీ జంట మాయం అయిపోయిందిట!

సరళ, ''టూ ప్లస్ టూ యీజీక్వల్ టు ఫోర్'' అంది నవ్వుతూ.

''కాదు'' అన్నాడు డుంబు. ''టూ టూ జార్ ఫోర్'' అన్నాడు. ''వీడొకడు పానకంలో పుడకలాగా'' అని, ఆ మొగుడూ పెళ్లాలు యిద్దరూ వాణ్ణి ఒకేసారి అందుకుని గట్టిగా ముద్దెట్టేసుకున్నారు.

★★★

ఆ మధ్యాహ్నం-రంగధామ్, సుమిత్రా దంపతులు-ఓకునుకు తీసేవేళ-పిల్లుల్లా పోట్లాడుకున్నారు. అసలీ మధ్య, ఆ యిద్దరి మధ్యా ఎప్పుడూ, ఏదో ఒకదాని వాదులాటే. మార్నింగ్ వాక్‌కి వెళ్ళేముందు బెడ్‌కాఫీ యివ్వలేదని ఒకరోజూ, యిస్తే, అయిష్టంగా యిచ్చావని మరోరోజూ, యిచ్చినదాన్ని అలా వదిలేసి, పోట్లాడిపోడం మరో రోజూ-యిలా...అయితే, ఆ రోజు మాత్రం-మ్యాట్నీషో మీదే కలహించుకున్నారని-సరళా, రాజేష్‌లు అనుకున్నారు.

అయినా మా డాడీ పబ్లిక్‌గా చెప్పి ఫస్ట్ షోకి వెళ్తే పోలా? అఫ్ కోర్స్...పాయింటది కాదు. అమ్మ-పాపం! ఎడ్యుకేటెడ్ అయినా, అమాయకురాలు! నాన్నగారి ప్రక్కన నిన్న కూచున్నావిడకి-తలనిండా భుజాల దాకా వ్రేలాడుతూ మల్లెపూల చెండు వుందిట-యీ సంగతి తనికి తెలిస్తే-యింకా దుఃఖపడుతుంది మా అమ్మ-'' అన్నాడు రాజేష్.

సరళ-సహజంగానే-గాసిప్ ఎక్స్‌పర్ట్-అని వాళ్ల ఆఫీసులో అంతా అంటారు. భర్తని బుగ్గమీద పొడిచి మరీ చెప్పింది. ''మీ అమ్మగారు కూడా శనివారం మధ్యాహ్నం యింట్లో లేరు. తాళాలు ప్రక్కనిచ్చి-మహిళామండలిలో-మెడిటేషన్ సెషన్ అని చెప్పి వెళ్ళిపోయారుట! ఆవిడొచ్చేదాకా-డుంబుగాడు-స్కూలు నుంచి వచ్చేక-ప్రక్కింటి గుండుగాడితో గోలీలాడేసుకున్నాడు..ఛీ! నాదుఃఖం ఎవరికి చెప్పుకోను? వాడిని నాశనం చేసుకుంటున్నాం యీవిడగారివల్ల. అసలూ మనం యిద్దరం ఉద్యోగాలు చెయ్యడమే తప్పు'' అంటూ నెత్తిమీద కుండ ఒలకబోసింది సరళ.

''అమ్మకి వీడే ప్రాణమే...ఏమాట కామాటే చెప్పుకోవాలి....అదే పెద్దాయనకి మంట..మొగుడు అన్నవాణ్ణి నెగ్లెక్ట్ చేస్తే ఎలా చెప్పు?'' తల్లిని వెనకేసుకొచ్చాడు.

తప్పదు. ఎందుకంటే-తనను ఎలా పెంచిందో, తన చెల్లి సౌభాగ్యనెలా పెంచిందో-అంతకన్నా 'యిది'గా డుంబుగాడి కోసం అమ్మ అంకితం అయిపోయింది!

కోడలు ఆ సాయంకాలం అత్తగారిమీద ఎనలేని ప్రేమ, జాలి ఒలకబోసింది. ఎంతయినా తోటి ఆడదికదా! ఆమె జాగాలో తానుంటేనా? ''మావగారిని వాషింగ్ మెషీన్‌లో పడేసేదాన్ని'' అనుకుంది. కాని యిప్పుడా యిద్దరినీ కలుపకూడదు. తనకీ, తన బిడ్డకీ అన్యాయం అయిపోతుంది. ఆమె వుంది కనుక-రాజేష్, తనూ ఆఫీసులు వదిలేక, షైర్లకీ, షికార్లకీ, ఆదివారాలు ఫ్రెండ్స్‌తో పిక్‌నిక్

లకీ-యిలా, అలా చెక్కేస్తున్నారు. ఇంటికి రాగానే ఫిల్టర్ కాఫీ, పకోడీలు రెడీ! అమ్మో! అత్తయ్యగారు-పదిరోజులు తన ఆడబొడుచు సౌభాగ్య పురిటికెళ్తేనే-అటు మామగారితోను, యిటు డుంబుగాడితోనూ వేగలేకపోయింది!-

సరిగ్గా యిదే బాధ రంగధామయ్యకి కూడా! పిల్లలు పెద్దాళ్లయ్యాకా వాళ్లతోనే ప్రపంచం అంది. వాళ్లపెళ్లయినాకా, వాళ్ల పిల్లలితోనే ప్రపంచం అంటోంది సుమిత్ర. ఛీ! ఆడదాని ప్రపంచం ఎంత సంకుచితం? ఎంత చిన్నది? కోడలొచ్చాకా, తాను యిలా-''రావోయ్ సుమూ-'' అనిపిలిస్తే కూడా-''యిష్షు! అమ్మాయి వింటుంది. ఆ చిటికెలేమిటి?'' అనేది. మనవడు పుట్టాక-తన గదిలోకే రాడం మానేసింది. ప్రతీదానికీ-''కొడుకూ, కోడలూ చూస్తారు'' అంటుంది. ''చూస్తే? ఏమిటిటా? వాలంటరీగా రిటైరయిపోయి సన్నాసుల్లో కలిసిపోతాను'' అనుకున్నాడు రంగధామ్. కాని, 'సుమూ'ని చూడకుండా ఎలా వుండగల్డు?

వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటే, హాయిగా యిద్దరం- ఓ పల్లెటూళ్లో-కొండల నడుమ, నీలాకాశం క్రింద, జలపాతం ప్రక్కని-టీ.వి లు, సినిమాలు, మనుమలు, మనుమరాళ్లు, కొడుకులు, పొరుగు సావిత్రమ్మలు, మహిళామండలి, గీతాబోధనలు గట్రాలేని-మారుమూలకి పారిపోతే? కాని, ''రాను పొమ్మంది'' సుమిత్ర-ఉత్త మొండిఘటం.

డుంబుగాడు తాను పెడితేనేగాని బువ్వ తినడుట! రాజేష్‌కి సరళ వంటచేస్తే నాలిక మీద వెంట్రుకలు మొలుస్తాయిట!

అలా సుమిత్రనే తలపోస్తూ యింటికి వస్తూనే-ఏమయేదో ఆ మధురోహలన్నీ-వొళ్లు మండించేసుకొనేవాడు అకవుంటెంట్ రంగధామ్. అర్థంకాని అమాయకురాలు సుమిత్ర. భర్త తనకి అన్యాయం చేస్తున్నాడు అనుకుంటూ-డుంబుగాడు తన మెడ చుట్టేసి పడుక్కున్నాకా రహస్యంగా వాడితో మాత్రం చెప్పుకుంటుంది. కాని, ఆ గది గోడలు కూడా వినవా మాటలు!



★★★

అమ్మా నాన్నల కీచులాటలు చూస్తూంటే రాజేష్‌కి ఒకోసారి పిచ్చెత్తిపోతుంది. వీళ్లిద్దర్నీ దూరంగా పెట్టేస్తే పోతుంది అనుకునేవాడు తన పెళ్లాం దగ్గర లేనప్పుడు.

''కాగల కార్యం గంధర్వులే తీర్చారు'' అన్నట్లు సౌభాగ్య మొదట ఉత్తరం రాసింది. ఆనక ఫోన్ చేసింది. ''అమ్మని ఒక్క రెండు వారాలు పంపండి వొదినా! మా ఆడబొడుచుకి ఎమ్మే పరీక్షలు! బాబిగాడు, బుజ్జమ్మ-యిద్దర్నీ చూసుకోడం నావల్ల కావటం లేదూ'' అని. అఫ్‌కోర్స్, అమ్మని చూడాలని కూడా వుందిట-

సుమిత్రకి సంతోష సముద్రమే తన హృదయంలో దూరి ఘోషించినట్లయింది.

డుంబుగాడు బెంగెట్టుకుంటే ఫోన్ చెయ్యండి, వచ్చేస్తానంది-పెట్టెసర్దుకుని రెడీ అయిపోయి.

-రంగధామ్?- ఇంకా ఎక్కడి రంగధామ్? రంగధామయ్య అనాలిట! సుమిత్ర తాను సుమిత్రమ్మ అయిపోయి, తనను రంగధామయ్యని చేసేసింది. భర్త ప్రక్కన కూర్చొని, దొంగతనంగా సినిమా చూడటంలో వున్న 'మజా' ఎంజాయ్ చెయ్యకుండా, బిడియంతో గజంన్నర మల్లెచెండుని కూడా సినిమాహాలు డస్ట్‌బిన్‌లో పారేసి యింటికి పరిగెత్తిందానాడు. అతనికి ఆరోజే ఒళ్లు ఉల్లీ మిరియం నూరి రాసుకున్నట్లు మండిపోయింది.

సుమిత్ర ఊరికిపోతూ పోతూ డుంబుగాడికి రకరకాలలంచాలిచ్చి-తిరిగి వస్తున్నప్పుడు యిన్ని చాక్లెట్లు, బిస్కత్తులూ, బొమ్మలూ తెస్తానని ప్రలోభపెట్టి మరీ వెళ్లిపోయింది. కోడలితోమాత్రం చెప్పింది. భర్త రంగధామ్ వినేలాగ-ఆయనగారి బెడ్ కాఫీ సంగతి మర్చిపోకమ్మా. లాకర్ తాళాలు పారేసుకొస్తారేమో-యింట్లోనే పెట్టమను. ఇలాంటివే యేవేవో చాలా చెప్పింది. రంగధామ్ అక్కడ వుంటేగా...డుంబుగాణ్ని ఎత్తుకుని మరీ బీచ్‌కి వెళ్లిపోయాడు. ''పదరా నాన్నా! మనకి నేడే స్వతంత్రదినం. లెటజ్ సెలబ్రేట్'' అనుకుంటూ-సముద్రం హోరులో పెళ్లాన్ని గట్టిగా తిట్టుకున్నా-నోబడీ బాదర్స్. దుఃఖం చల్లారాలంటే అంతే చెయ్యాలి మరి. కాని, పరోక్షంలో 'సుమూ'ని తిట్టగలడా? తనని తనే తిట్టుకున్నాడు.

★★★

సౌభాగ్యనీ, పిల్లల్నీ చూసిన కొన్ని గంటలదాకా సుమిత్రకి మరేం జ్ఞాపకం లేవుగాని- మర్నాటి నుంచీ 'గిల్టీ'గా ఫీలవడం మొదలెట్టింది! కాలం వెనక్కి వెళ్లదంటారు గానీ అది వెనక్కి వెళ్లే మాధ్యం మనస్సే- సుమిత్రకి భర్తదూరం అయ్యేసరికి- మనస్సు ఆరాటపడి, పాతికేళ్లు వెనక్కి వెనక్కి భలే పరిగెత్తింది. టెలిఫోన్ వేపు ఆశగా చూస్తూ, అక్కడే కూర్చునేది. భర్త ఫోన్ చేస్తాడేమో- తన గురించి బెంగ పడుతున్నానని చెబుతాడేమోనన్నది ఒక వెర్రి ఆశ!

ఆ రోజులే వేరు!

ఇన్ని టెలిఫోన్‌లెక్కడ? ఇన్ని సినిమా హాల్స్ ఎక్కడ? అయినా- ఎలాగో సంకేత, సందేశాలు అందుకుని, యింట్లో అబద్ధాలు చెప్పి- రంగధామ్‌తో పారిపోయేది సుమిత్ర! మ్యూజియమ్‌లు, సెంట్రల్ పార్కులు, సినిమా థియేటర్లు, ఎగ్జిబిషన్లు- దేనికి టిక్కెట్టుంటే దానికి- హమేషా రెండు టిక్కెట్లు కొని అట్టేపెట్టేవాడు- పైలాపచ్చీస్ రంగధామ్.

ఒప్పులకుప్ప వొయ్యారి భామ- 'సుమూ' అలా పెళ్లికి ముందే ఓ టిక్కెట్ ముక్కల 'ఖజానా' సంపాదించింది. అవి యిప్పటికీ పాత బీరువా లాకర్‌లో ఎక్కడో దాచింది. ఎలా వున్నాయో? తమ మధురస్మృతులకు అవే సాక్ష్యాలు!

సుమిత్రలో హఠాత్తుగా పడుచుదనం లేచి నేలతల్లిని మొలకెత్తే విత్తనం పొడుస్తున్నట్లు- పొడుస్తున్నది. రాత్రి నిద్ర పట్టలేదామెకు. పగలు పనిచేత బట్టడం లేదు. ప్రొద్దున్నే లేచి బెడ్ కాఫీ పెట్టేసిందేనాడు. కూతురు సౌభాగ్య యిది చూసి నవ్వేసింది. ''మా ఆయన అస్సలు కాఫీయే తాగరు. మరిచిపోయావా అమ్మా?'' అంటూ-

ఆరోజు కలొచ్చింది. వేకువఝామున సుమిత్రకి- 'సుమూ' అంటూ ఫోన్‌లో 'ఆయన' పిలిచాడు. ఆ మధురకంఠంలో వెయ్యి ఏనుగుల బలంతో తనను లాగేసుకునే శక్తీ, మహిమా- ఆ పిలుపుకుంది. ''రెండు టిక్కెట్లు కొన్నాను'' అన్నాడు రంగధామ్. ''నేను రెడీ... దూరంగా ఏదైనా వూరికి- కాశీకో, రామేశ్వరానికో, కన్యాకుమారికో- ఎక్కడికైనా సరే...'' అంటోంది. తను- యిట్నుంచి ఫోన్‌లో. పొలకమారింది. తెలివొచ్చింది.

లేచి కూర్చుని, లెంపలేసుకుంది. ''సార్'' అన్నది గట్టిగా.

ప్రేమతోనో, లేదా వేళాకోళంగానో తాను భర్తను సంబోధించే మాట అదే! ''సార్''- ఔను తన 'సార్' రంగధాముడే! మిగతాదంతా 'మిత్' అనుకుంది తృప్తిగా సుమిత్ర.

అంతలో- టెలిఫోన్ నిజంగానే మ్రోగింది. టక్కున తీసుకుని 'నేనేనండీ' అంది అప్రయత్నంగా. రంగధామ్ అవతల- ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడని అతని కంఠంలోని తొట్రుపాటే చెబుతోంది.

ఐ కెనాట్ లివ్ విత్ అవుట్ యూ- సుమూ, అన్నాడు భర్త.

హాయిగా ఎగిరిపోదాం రాండి సార్! నాకు రెక్కలొచ్చాయ్'' అంది.

అంతలో, అల్లుడు లేచిన అలికిడి అయింది. ఫోన్ కట్ చేసేసింది. చేసేముందు తెలివిగా- 'రేపు అయిదున్నరకి- సార్'' అంది గడుసుగా-

అల్లుడు అడక్కుండానే- రాంగ్‌నెంబర్ బాబూ! పోయి పడుక్కోండి. ఇంకా ఆరు కాలేదు. నే లేస్తాగా-'' అంది సంజాయిషీ యిస్తున్నట్లు!

ప్రేమ దొంగది! ప్రేమ దుస్సాహసపుది. ప్రేమ అబద్ధాలాడుతుంది! మర్నాటిదాకా ఒకటే ఆలోచనలు సుమిత్రకి. ఆమె యిప్పుడు ఒక మనుమల తల్లికాదు. ఒక నవవధువు! ఒక విరహోత్కంఠిత! ప్రేమజ్వరం కాస్తోందామెకు. ఏమిటో? మాయ...

★★★

అప్పటిదాకా జలజలా చిరుజల్లులు పడి వెలిశాయి. మధ్యాహ్నపుటెండ కాస్తా నీరెండ అయిపోయింది!

రంగధామ్ బ్రీఫ్‌కేస్‌తో- టోపీ గ్రట్రాపెట్టుకొని, దొరబాబులాగ- ప్లాట్‌ఫారమ్ మీదకి వస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురు నడిచాడు.

''అదుగో... అదుగో... యస్ ఫోర్'' భోగీ.. కిటికీ దగ్గర దీపం వెలిగినట్లు. సుమిత్ర మొహం కనబడ్డది- రంగధామ్‌కి! ఎదురేగి ఆమె దగ్గర బ్యాగ్ అందుకున్నాడు.

''రావేమోనని భయపడ్డా'' నంటూ, సుమిత్ర చెయ్యందుకుని దింపాడు. ధైర్యం కోసమా? అన్నట్లు గుండెలమీద ఒక చెయ్యి వేసుకుని- ''ఎవరేనా చూస్తారేమోనండీ'' అంది సుమిత్ర భర్త చెయ్యి వదలకుండానే...

''ఏమ్! మనిద్దరం వాళ్లందరి దృష్టిలో మొగుడూ పెళ్లాలమే. మనవరకే మనం లేచిపోతున్న ప్రేయసీ ప్రియులం... పద.. పద- యివిగో రెండు టిక్కెట్లు... డోంట్ కేర్.. బి హ్యాపీ..''

ఆ రెండు టిక్కెట్లూ ఠక్కున అందుకుని- ''థాంక్యూ సార్!'' అంది సుమూ.

అదే రైలు- ఆ యిద్దర్నీ మళ్లీ ఎక్కించుకుని ముందుకి సాగింది. కానీ, యీసారి ఆ యిద్దరూ- గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నా- హాయిగా, స్వేచ్ఛగా ఎ.సి. కంపార్ట్‌మెంట్ ఛైయిర్ కార్‌లో కూర్చున్నారు.

''అమ్మాయితో వాళ్ల మైసూర్ అత్తయ్యగారింటికి పోతాను అని చెప్పానండీ... కాని, ఏమిటో నాకు భయంగా వుందండీ!'' భర్త చెయ్యి తన ఒళ్లోకి తీసుకుంది.

''కళ్లు మూసుకో. భయం పోతుంది. నేనూ అబ్బాయికదే చెప్పానులే!'' అన్నాడు- ఆమె మొహంలోకి అప్పుడే చూసినట్లు చూస్తూ...

కనులు మూసుకుంది సుమిత్ర. హాయిగా, గుండెల నిండా వూపిరి పీల్చుకుంది. జగతిన వున్నది మనమిద్దరమేనని అనుకుని హత్తుకుపోతుంటే- చెప్పలేని ఆ హాయి ఎంతో వెచ్చగ వుంటుందోయీ'' అన్న తమ తారుణ్యపు తొలి రోజులనాటి పాట సన్నాయి మీద వాయిస్తున్నట్లుంది. మనసులో మెత్తని, అతి మెత్తనిచోట, అది ఆమెకు పులకింతలు పెడుతోంది.

ఏదో సాధించాలనన్న తృప్తితో రంగధామ్ భార్య భుజం మీదుగా చెయ్యివేసి, రెండోచేత్తో ఆమె ముంగురులు సవరించాడు. పీయూజ్ ఏన్ ఏంజిల్ అని మురిసిపోయాడు.

అక్కడ జరుగుతున్నది శరీరాలమధ్య సాన్నిహిత్యం కాదు. అది రెండు మనసుల సంగమం... పైగా- ఏ.సి. కంపార్టుమెంటు కదా- వేరే శబ్దకాలుష్యం లేదు. ప్రశాంతంగా ముందుకి సాగిపోతున్నది రైలు. దాంతోపాటే- తెప్పలో తేలుతున్నట్లుందా యిద్దరికీ.


''కోయిలపుటాదె ముఝె మేరే బీతే హుయేదిన్'' అంటోంది అతని మనస్సు-

''సార్! ఎక్కడికి మన ప్రయాణం?'' మగతగా అడిగింది సుమూ. ఉలిక్కిపడి, సర్దుకున్నాడు రంగధామ్.

ఆ కంపార్ట్‌మెంట్ కిటికీ తెరలు కొంచెం అసింటా జరిపాడు.

''అటుచూడు- దూరంగా, ఎత్తుగా- అదుగో చిటికెడు ఆకాశం!... ఎంత స్నిగ్ధంగా, నీలంగా, హ్యాపీగా, ఎలాఫ్రీగా వుందో చూడు! నువ్వూ, నేనూ, ఆ ఆకాశం- ఆనందం, ఆ స్వేచ్ఛా- అక్కడికే మనం- అంటూ ఏదో పొయిట్రీ చెప్పేస్తున్నాడు ప్రియుడు. ప్రేయసి సుమిత్ర మాట్లాడలేదు. రంగధామ్ కూడా టక్కున వూరుకున్నాడు. మాట్లాడాలని లేదు. కనులు తాపీగా మూతపడ్డాయి. తనువులక్కడే వున్నాయి. కాని- వాళ్ల మనసులా? అవి కొత్తగా రెక్కలొచ్చిన కోర్కెల్లా- స్వేచ్ఛగా- హాయిగా- ఎత్తుగా- ఎక్కడికో ఎగిరిపోతున్నాయ్!

★



## మరో హనీమూన్!

సంజయ్ దత్‌కి తన (ఇప్పటి) భార్య రియా అంటే వల్లమాలిన ప్రేమాభిమానాలని రుజువు చేస్తూనే వున్నాడు. ఆమె గురించి తన పాత అలవాట్లు ఎన్నింటినో మార్చేసుకున్నాడు. మంచి భర్తగా, గృహస్తుగా జీవితంలోని మాధుర్యాన్ని రియాతో కలిసి ఆస్వాదిస్తున్నాడని చెప్పుకోడానికి తాజా ఉదాహరణ- తమ తొలి వెడ్డింగ్ యానివర్సరీకి కూడా హనీమూన్ జరుపుకోవడం. మామూలుగా పెళ్లయిన వెంటనే కొత్త దంపతులు హనీమూన్‌కి వెళ్లడం పరిపాటి. కానీ సంజయ్- రియాలు మాత్రం తమ మొదటి పెళ్లి రోజు సందర్భంగా కూడా విదేశాలకెళ్లి ఎంచక్కా ఎంజాయ్ చేసొచ్చారట. ప్రేమంటే ఇదే మరి అనుకుందాం!

- జె.ఎం.